హైదరాబాద్ వార్త



# తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కారు రావాలి

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కారు రావాల్సిన అవసరం ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా లంకల దీపక్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. 'ఇటీవల హర్యానాలో, నిన్న ఢిల్లీలో భారతీయ జనతా పార్టీని గెలిపించారు. మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ గారిపై విశ్వాసంతో బిజెపిని ఆదరిస్తున్నారు. ఇక మిగిలింది తెలంగాణ రాష్ట్రం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు అనేక రకాల హామీలిచ్చి, ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా వైఫల్యం చెందింది. వచ్చే శాసనసభ ఎన్నికలకు ముందు మనమంతా సిద్ధంగా ఉండాలి. దానికంటే ముందు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలుంటాయి. ఈ ఎన్నికల్లో అహంకారపూరిత మజ్లిస్ పార్టీ కోరలు పీకి కాషాయ జెండా ఎగురవేయాలి. ఈసారి జీహెచ్ఎంసీలో వందకు వందసీట్లు గెలిపించుకునేలా బిజెపి శ్రేణులు కృషిచేయాలి' అని పిలుపు నిచ్చారు. 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడం హర్షనీయమన్నారు. ప్రజలను విభజించి, అనేక రకాలుగా మోసపూరిత హామీలిచ్చి మభ్యపెట్టి, చివరకు లిక్కర్ కుంబకోణానికి పాల్పడ్డ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఓడించి పాతరేశారని అన్నారు. దేశంలో వరుసగా అనేక రాష్ట్రాల్లో బిజెపి విజయ దుందుభి మోగిస్తోందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రెండోసారి, మధ్యప్రదేశ్‌లో మూడోసారి, గుజరాత్‌లో ఆరోసారి, గోవాలో మూడోసారి అధికారంలోకి వచ్చామన్నారు. అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించింది, కాషాయ జెండా రెపరెపలాడించేలా నరేంద్ర మోదీ పాలన అందిస్తున్నారని చెప్పారు. మన పక్కనున్న దేశాలు పాకిస్తాన్, బంగ్లదేశ్‌తో పాటు అమెరికా, యూకే, శ్రీలంక వంటి దేశాల్లో ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని అన్నారు. మన దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో స్థిరమైన ఆర్థిక వ్యవస్థతో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక దేశంగా భారత్ ఐదో స్థానంలో ఉందన్నారు. ప్రపంచంలో ఏ సమస్య వచ్చినా పరిష్కారం కోసం మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ గారిని అభ్యర్థిస్తున్నారని చెప్పారు. దీపక్‌రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలో బిజెపిని ముందుకు తీసుకెళ్లాలని, అందుకు అందరు సహకరించాలని కోరుతున్నానని చెప్పారు. లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ, నేతలను సమన్వయ పరుస్తూ పార్టీని బలమైన శక్తిగా రూపొందిస్తానని చెప్పారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

# ఔటర్ రోడ్స్..డేంజర్ స్టంట్స్..!

## రింగ్‌రోడ్డుపై కార్ రేసింగ్.. సిసి టివి కెమెరాలలో రికార్డు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

ఓఆర్ఆర్‌పై రాత్రి వేళ ఆకతాయిల హల్‌చల్ సృష్టిస్తున్నారు. కార్ రేసింగ్, స్టంట్లు నిర్వహిస్తూ సాధారణ వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. హైదరాబాద్ మహానగరంలో మరో సారి కార్ రేసర్లు రెచ్చిపోయారు. శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై ఆదివారం తెల్లవారుజామున కొంత మంది యువకులు కార్లతో రేసింగ్‌లు, స్టంట్లు చేయడం ఆ ప్రాంతంలోని సీసీటీవీ కెమె రాలో రికార్డ్ అయ్యాయి. ఈ యువకులు ఓఆర్ఆర్ పై వేగంగా కార్లు నడిపించి, ఆపై ఒక్కసారిగా వాటిని ఆపి గింగిరాలు తిప్పారు. ఇలా ఉన్నచోటే కార్లను పలుమార్లు రౌండ్‌గా తిప్పుతూ హంగామా సృష్టించారు. కార్ రేసింగ్ కారణంగా ఓఆర్ఆర్‌పై ప్రయాణిస్తున్న ఇతర వాహనదారులకు పెద్ద ఇబ్బం దులు ఎదురయ్యాయి. వీరి స్టంట్‌లు సీసీ టీవీ ఫుటేజీలో రికార్డ్ అవడంతో, ఆ ఫుటేజీ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

శంషాబాద్ ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు ఈ వీడియో ఆధారంగా రేసింగ్‌కు పాల్పడిన యువకులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. అయితే, ఓఆర్ఆర్‌పై పెట్రో లింగ్ తగ్గిపోవడంతో ఇలాంటి రేసింగ్‌లు తిరిగి మొదలైనట్లు ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

ఈ సంఘటన ఆందోళన కలిగించడంతో అధి కారులు స్పందించి, రౌడీ ఆటగాళ్లను అడ్డుకునేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# "విద్యుత్"తో జరభద్రం..!

* ఎండాకాలం గోదాములు ఇళ్లల్లో జాగ్రత్తలు తప్పనిసరి * అదనపు లోడ్ పడకుండా ఏర్పాట్లు
* షార్ట్‌సర్క్యూట్ నివారణకు ముందస్తు చర్యలు * రెండేళ్లకోసారి విద్యుత్‌తీగల తనిఖీ చేయాల్సిందే



**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

ఎండలు మండిపోతున్నాయి.. ప్రతి ఇంట్లో కూలర్లు, ఏసీల వాడకం ప్రారంభమైంది. తక్కువ ధరలకే మార్కెట్‌లో లభిస్తున్న ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లను వాడేందుకు ప్రజలు ఆసక్తి చూపుతుంటారు. ధర తక్కువగా ఉన్న విద్యుత్ పరికరాల వాడకంతో షార్ట్‌సర్క్యూట్ జరిగే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు ఎలక్ట్రికల్ నిపుణులు. వేసవి కాలంలో షార్ట్‌సర్క్యూట్స్ విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. మండుతున్న ఎండలకు మంటలు చెలరేగే అవకాశాలు ఎక్కువేనని, కాస్త జాగ్రత్తలు తీసుకుంటే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూసుకోవచ్చునని విద్యుత్ శాఖ తనిఖీ అధికారులు తెలుపుతున్నారు. ఎండకాలంలో గోదామలు, ఆఫీసులు, ఇళ్లల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకోల్సిందేనని పేర్కొంటున్నారు. వేసవిలో ప్రమాదాలు ఎక్కువగా వాణిజ్య కేంద్రాలు, దుకాణాలు, బహుళ అంతస్తులు, గోదాముల్లో జరుగుతుంటాయి. మాల్స్, షాప్స్ మూసివేసేముందు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఏటా ఇళ్లు, కార్యాలయాల్లో విద్యుత్ వైరింగ్ సిస్టమ్ లైసెన్స్ తీసుకున్న టెక్నీషియన్లతో తనిఖీ చేయించుకుంటే ప్రమాదాలు నివారించవచ్చు. చాలావరకు ఏళ్లతరబడి విద్యుత్ తీగలు మార్చకుండా, స్విచ్‌బాక్స్‌లు పాతవే వాడుతుండటంతో షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదాలున్నాయని విద్యుత్ అధికారులు తెలుపుతున్నారు.

**వైరింగ్‌లో జాగ్రత్తలు...**

విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ ప్రమాణాల సామాగ్రినే ఉపయోగించాలి. ఏవస్తువు వాడేందుకు ఎంత విద్యుత్ అవసరపడుతుందో తెలుసుకుని అందుకు అనుగుణంగా ఏర్పాటుచేసుకోవాలి. ఉదాహారణకు 10 యాంప్స్ విద్యుత్ వినియోగించేచోట 20 యాంప్స్ విద్యుత్ భారం పడే పరికరాలు ఉపయోగిస్తే తీగలు కాలిపోయే అవకాశం ఉంది. ఇళ్లల్లో, ఆఫీసుల్లో అవసరమైన మేరకు తగిన లోడ్ ఉన్న విద్యుత్ తీగలు ఉపయోగించాలి. నాసిరకం పరకరాలు వాడటం వల్ల విద్యుత్ వృధా అవుతుందని గుర్తించాలి. ఇన్సులేషన్ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి ఇంట్లో చిన్న వాణిజ్య భవనాల్లో న్యూట్రల్ పరికరాలకోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి. భూమిలోని తేమ, ఉష్ణోగ్రతపై ఎర్తింగ్ సిస్టమ్ ఆధారపడుతోంది. ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పనిచేయాలంటే ఎర్తింగ్‌ను సరైన పద్ధతిలో ఉంచేందుకు నీరు దొడ్డు ఉప్పు ఉపయోగించాలి. గృహాలు, కార్యాలయాల్లో విద్యుత్ వాడేందుకు పిన్నులు, ప్లగ్‌లు, సాకెట్లను మాత్రమే ఉపయోగించాలి. ఒకే స్విచ్‌బోర్డ్‌కు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగించడంతో లోడ్ పెరుగుతుంది. ఇళ్లలో కొత్తగా విద్యుత్ ఉపకరణాలు పెట్టేందుకు అవసరమైన కనెక్టడ్ లోడ్ ఉందో లేదో చూసుకోవాలి. అందుకు తగినట్లు వైరింగ్ ఏర్పాటు తర్వాతే ఏసీలు, వాటర్స్ హీటర్స్, మైక్రో ఓవెన్ ఇతర ఎలక్ట్రిల్ వస్తువులు ఉపయోగించాలి.

**లోడ్‌కు తగ్గట్టు విద్యుత్‌వాడకం ఉండాలి..**

-విద్యుత్ కనెక్షన్ ఉన్నచోట లోడ్ అనుమతి వరకే వినియోగించాలి. పాత విద్యుత్ తీగలున్నా లోడ్ పెరిగితే విద్యుత్‌ప్రమాదాలకు ప్రమాదం ఉంటుంది.

-విద్యుత్ వైర్లు ఎండలో లేకుండా చూసుకోవాలి. ఎండ వేడికి తీగలపై ఉన్నరబ్బర్ మెత్తబడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

-గృహాలు ఆఫీసుల్లో విద్యుత్ పనులు లైసెన్స్ కలిగిన కాంట్రాక్టర్‌తో చేయించుకోవాలి. తరుచూ తనిఖీలు నిర్వహిస్తుండాలి.

-ఎర్తింగ్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. ఏదైనా షార్ట్‌సర్క్యూట్ జరిగితే ఎర్తింగ్ ఉండటం వల్ల ఎంసీపీ ట్రిప్ అవుతుంది.

-విద్యుత్ వైరింగ్‌ను 4.చ.మిల్లీమీటర్ మందం కలిగిన తీగలు, విద్యుత్ స్విచ్ బాక్స్‌లు మాత్రమే వినియోగించుకోవాలి.

-అతుకులు లేని విద్యుత్‌తీగలు వాడాలి. అతుకులు గల విద్యుత్‌తీగలు వాడితే విద్యుత్ సరఫరాలో భారం పెరిగినప్పుడు స్పార్స్‌వచ్చి విద్యుత్ ప్రమాదాలకు కారణమవుతాయి.



గోదాంలో ఎగిసి పడుతున్న మంటలు

# కుర్చీల గోదాంలో అగ్ని ప్రమాదం

## రూ. 10 లక్షల ఆస్తి నష్టం

**మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదివారం కాటేదాన్ పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. పది లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పైడినాయుడు కథనం ప్రకారం... రింకుజైన్ సెలూన్స్ కుర్చీల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. కాగా కాటేదాన్‌లోని పారిశ్రామికవాడలో సెలూన్స్ కుర్చీలు విక్రయించే గోదాం రింకు జైన్‌కు ఉంది. గోదాంలో సెలూన్స్ కుర్చీలు, ఇతర వస్తువులు ఉన్నాయి. ఆదివారం సెలవు కావటంతో గోదాం మూసి వేసి ఉంది. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారి గోదాం నుంచి మంటలు రావటంతో ఎదురుగా నివాసం ఉంటున్న కార్మికులు ఈ విషయాన్ని యజమాని రింకుజైన్‌కు తెలిపారు. సెలూన్స్ కుర్చీ కింద ఉన్న స్పాంజ్ వల్ల మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక ఇంజన్లు రప్పించి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దాదాపు పది లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని ఎస్ఐ పైడి నాయుడు వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతి

**మలక్‌పేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... న్యూ మలక్‌పేట్‌కు చెందిన మహమ్మద్ మోయిన్‌ఖాన్(60) ఆదివారం తెల్లవారుజామున చాదర్‌ఘాట్ చమాన్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుండి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**మరో సంఘటనలో...** ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సయ్యద్(45) మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ మెయిన్ గేట్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు చాదర్ ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

# మరణంలోనూ ఐదుగురికి ప్రాణం పోసిన డాక్టరమ్మ



**నార్సింగి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తాను మరణించినా..ఐదుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించింది ఆ డాక్టరమ్మ. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డాక్టర్ భూమిక బ్రేయిన్ డెడ్ అయింది. తను చనిపోతూ మరో..ఐదుగురికి ప్రాణంపోసి, తను నిజమైన డాక్టర్‌నని మరణంలోనూ రుజువు చేసుకుంది భూమిక..ఎంతో భవిష్యత్తు ఉన్న తమ బిడ్డ ఇలా అర్ధాంతరంగా తనువు చాలించిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతూనే, భూమిక అవయవాలను దానం. చేశారు. కుటుంబ సభ్యులు, వైద్యులు అందరూ భూమిక మృత దేహానికి "సెల్యూట్" చేశారు. హైదరాబాదులోని బాచుపల్లి ప్రాంతానికి చెందిక జశ్వంత్(24), ఎల్,బి.నగర్ కు చెందిన భూమిక (24) ఇద్దరూ కామినేని ఆసుపత్రిలో హౌస్ సర్జన్ లుగా పని చేస్తున్నారు. 31.జనవరి 2025న రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలంలో జరిగిన తమ స్నేహితుల పెళ్లికి వెళ్లారు. తిరిగి ఈ నెల ఒకటవ తేదీన తెల్లవారుజామున, తమ కారులో హైదరాబాదుకు వస్తుండగా ఖానాపూర్ వద్ద వేగం అదుపు తప్పి డివైడర్ ను ఢీకొన్నారు. ఈ సంఘటనలో జస్వంత్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడ్డ భూమికను పోలీసులు చికిత్స కోసం కాంటినెంటల్ ఆసుపత్రి కి తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందిన భూమిక బ్రేయిన్ డెడ్ అయ్యింది. ఈ విషయం ను వైద్యులు ఆమె లివర్, కిడ్నీలు, గుండె, లంగ్స్‌ను ఐదుగురికి అమర్చేందుకు వైద్యులు నిర్ణయించారు. ఆమె కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు పెద్దమనసుతో తమ బిడ్డ అవయవాలను .. ఐదుగురి ప్రాణాలు నిలబెట్టాలని అవయవ దానం చేశారు... ఈ చర్యకు వైద్యులు, స్థానికులు కుటుంబ సభ్యులను అభినందించారు. పుట్టెడు దుంఖం లోనూ ఔదార్యం చూపిస్తూ అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చిన డాక్టరమ్మ కుటుంబ షభ్యులకు సెల్యూట్ అంటూ ఆర్టీసి ఎండి సజ్జనార్ ట్వీట్ చేశారు.

# ఎముకల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్





నెక్లెస్ రోడ్డులో ఆర్థోపెడిక్ వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**బేగంపేట ఫిభ్రవరి 9,ప్రభాతవార్త**

ఎముకలు బలంగా ఉండాలంటే తీసుకోవాల్సిన ఆహారంపై వైద్యులను అడిగి తెల్సుకోవాలని, ఎముకల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో మూనోట్ హెల్త్ కేర్ ఫౌండేషన్, సంస్కృతి బిజినెస్ సొల్యూషన్స్‌తో కలిసి జలవిహార్ నుంచి నిర్వహించిన 3కే,5కే, 7కే ఆర్థోపెడిక్ వాక్‌థాన్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ముఖ్యంగా ఎముకలకు సంబంధించి సమస్యలపై పరిక్షలు చేయించుకోవలని సూచించారు. ఎముకలు బలంగా లేకపోవడంతో చిన్న చిన్న ప్రమాదాలకు కాళ్లు, చేతులు విరిగి పోతున్నాయన్నారు. డాక్టర్ ప్రదీప్ మూనోట్, శిల్పమునోట్, కార్యక్రమం నిర్వహిస్తున్న ముంబైకి చెందిన స్వచ్ఛంద సంస్థ ఎస్‌బిఎస్‌కి మంత్రి పొన్నం అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమం ద్వారా ఆర్థోపెడిక్ పై అవగాహన కల్పిస్తున్నారన్నారు. దీని ద్వారా మరో 50మందికి చెప్పి అవగాహన కల్పించాలన్నారు. తాము గత నెలలో రహదారి బద్రతపై అవగాహన నెల చేసామన్నారు. దాని వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించామన్నారు. ఇది కూడా అలాంటి కార్యక్రమమేనని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలియజేసారు. ఈ వాక్‌థాన్‌లో పరిశ్రమలు వాణిజ్యం మరియూ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వం సైకాజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేసేవరకు ఉద్యమిస్తాం : రాంచందర్

**సైఫాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో సైకాలజిస్ట్స్ కౌన్సిల్‌ను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ డిమాండ్ చేశారు. కౌన్సిల్ ఏర్పాటు చేసేంతవరకు అసోసియేషన్ సైకాలజిస్టులు ఐక్యంగా పోరాడతారని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా సైకాలజిస్టుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. సైకాలజిస్టులు కలిసి పోరాడితే సాధ్యం కానిదంటూ ఏది లేదన్నారు. సమాజానికి ఉపయుక్తమైన సేవలను సైకాలజిస్టులు అందించాలని, ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షల సమయం జరుగుతున్నందున విద్యార్థులలో ఉన్న భయాన్ని పోగోట్టాలని సూచించారు. అలాగే సమాజంలోని మానసిక రుగ్మతుల నివారణకు కూడా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్రీపూజ, ఎ.సుధాకర్, డా.వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, రోజారాణి, రోజా, సతీష్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# పిఇటి పోస్టులను వెంటనే భర్తీ చేయాలి





మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

**సైఫాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న పిఇటీలు విద్యార్థులను గొప్ప క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిపైనే ఉందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ సంక్షేమ గురుకుల స్కూల్స్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్ర ప్రభుత్వానికి పిఇటీలు ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడే విధంగా పిఇటిలు అంకితాభావంతో పనిచేయాలని, గురుకుల విద్యార్థులను అన్ని రంగాలలో అగ్రస్థానంలో ఉంచాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1600 పిటిటి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. అధికార పార్టీలో ఉండి నిరుద్యోగుల కోసం పోరాటం చేస్తున్న నాయకుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి చట్ట సభలలో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తాను నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటి చేస్తున్నానని భారీ మెజార్టితో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేశ్, బిసి నాయకులు వేముల రామకృష్ణ, జిల్లపల్లి అంజీ, అసోసియేషన్ నాయకులు సైదులుగౌడ్, పర్వతాలు, పి.సుచేత, రుషికేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మాల, మాదిగ ప్రజాప్రతినిధులకు క్రీమిలేయర్ వర్తింపజేయాలి

## మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ



మాట్లాడుతున్న పబ్బతి శ్రీకృష్ణ

**సైఫాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**

మతోన్మాద బిజెపి సుప్రీం కోర్టు ద్వారా తీసుకు వచ్చిన ఎస్సీ వర్గీకరణను సిఎం రేవంత్‌రెడ్డి అమలు చేయడాన్ని మాల మహానాడు జాతీయ కమిటీ తీవ్రంగా ఖండించింది. అసెంబ్లీలో క్రిమిలేయర్ విధానాన్ని వ్యతిరేకించిన మాల, మాదిగ ప్రజాప్రతినిధులకు క్రిమిలేయర్ వర్తింపు జేయాలని, అలాగే మాల, మాదిగలను ఓసిల జాబితాలో చేర్చాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ చెప్పు చేతుల్లో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని, తాము గతంలోనే ప్రకటించడం జరిగిందని, జనాభా లెక్కలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ విషయంలో బయటపడిందని ఆరోపించారు. ఇవి ప్రభుత్వ లెక్కలు కాదని, రెడ్లు రాసిచ్చిన లెక్కలని మండిపడ్డారు. అందుకే బిసి, ఎస్సీ, ఎస్టీ జనాభా లెక్కల్ని లక్షల్లో తగ్గించి అగ్రకులాల వారిని పెంచుకున్నారని ఆయన విమర్శించారు. క్రిమిలేయర్‌ను వ్యతిరేకించిన వారు వర్గీకరణను కూడా వ్యతిరేకించాలని, రాజకీయ లబ్ధికోసం వర్గీకరణకు మద్దతు ఇచ్చి క్రిమిలేయర్ ను వ్యతిరేకించడం సమంజసం కాదన్నారు. వర్గీకరణ చేసి మాలలను శత్రువులుగా చూపించిన రాజకీయ పార్టీల నాయకులు, పార్టీలపై ఎన్నికల్లో ఓడించడమే కాకుండా భౌతికంగా దాడులు చేయడానికి మలాలు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు నాయకులు సంకి ప్రసాద్, కిషన్, తలారి సురేష్, గాలి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

## ఎంపి ఈటల రాజేందర్





ముగింపు వేడుకల్లో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, గడ్డం సాయికిరణ్ తదితరులు

**రామంతాపూర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**

విద్యార్థులకు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేందుకు తగు చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 6వ ఆగమ్మ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ -2025 ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేందుకు సత్యసాయి విద్యా సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతున్న సత్యసాయి విద్యా సంస్థలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. విద్యా సంస్థల చైర్మన్ గడ్డం సాయికిరణ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఆగమ్మ మెమోరియల్ క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. క్రీడలలో విజయం సాధించిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కింగ్స్ గ్రామర్ స్కూల్ మధుసూధన్‌రెడ్డి, ఈటల భద్రయ్య, జయసార్, స్కూల్ చైర్మన్ గడ్డం సాయికిరణ్, వైస్ ప్రిన్సిపల్ వెంకటేష్, గడ్డం వెంకటసాయి, శంకర్, హనుమంతరావు, ధనలక్ష్మి, శివపద్మ, శైలజ, నాగరాజు, మల్లయ్య, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద

## వైభవంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

### వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

**నిజాంపేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 30వ డివిజన్‌లో ఏనుగుల వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో వైభవంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ 124వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఏటా జరిగే భ్రమరాంబా మల్లికార్జున స్వామి, రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం భక్తుల ఐక్యతా, ఆధ్యాత్మిక శ్రద్ధకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో లీడర్ నర్సింహా రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబశివా రెడ్డి, దశరథ్, ముత్యాలు, దండుగుల స్వామి, ఏనుగుల రాజశేఖర్ రెడ్డి, విష్ణు, ఎన్ఎంసి మహిళా అధ్యక్షురాలు అర్పిత ప్రకాష్, ఆలయ కమిటీ సభ్యులు ఏనుగుల కృష్ణ రెడ్డి, ఏనుగుల నర్సింహా రెడ్డి, ఏనుగుల సత్తిరెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆగం రాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే...

**నిజాంపేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 17వ వార్డులో స్థానిక కార్పొరేటర్ ఆగంరాజుకు కౌసల్య కాలనీ సంక్షేమం సంఘం వారు ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ హయంలో నిజాంపేట్‌ని మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసుకొని ఎన్నో అభివృద్ధి పనులను పూర్తి చేసుకొని ఒక మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చెందు ముదిరాజ్, బొబ్బా శ్రీను, దశరథ్, ప్రదీప్, సాంబశివారెడ్డి అజయ్‌చౌదరి వైయస్సార్, అర్పితా ప్రకాష్, 17వవార్డు యూత్ అధ్యక్షులు బద్రి, కాలనీవాసులు ఆకుల చందు, నరేష్, సురేష్, దినేష్, అన్వేష్, సుజాత, మల్లేష్, కృష్ణయ్య, పాల్గొన్నారు.

### రాజయోగ మెడిటేషన్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**నిజాంపేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ప్రగతినగర్ పరిధిలోని రాఘవేంద్ర హోమ్స్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో నూతన రాజయోగ మెడిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివేకానంద ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ రాజయోగ ధ్యానం మన మనస్సును ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడిని తగ్గించడానికి ముఖ్యమైన సాధనం అన్నారు. బ్రహ్మకుమారీస్ సీనియర్ గైడ్‌లు రాజయోగ ధ్యానానికి సంబంధించిన వివరణాత్మక వివరాలను అందించి, ధ్యానం ద్వారా ఆధ్యాత్మిక పురోగతి, మానసిక ప్రశాంతత, మరియు ఆరోగ్యకరమైన జీవన విధానంపై పలు విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నాయకులు జస్వంత్, సాంబశివారెడ్డి, అజయ్ చౌదరి, స్వామి, బిక్షపతి, వై ఎస్ ఆర్, ముత్యాలు, మహిళా నాయకులు అర్పిత ప్రకాష్, లలితా రెడ్డి, పద్మ, బ్రహ్మకుమారీస్ దిల్ రెడ్డి బయ్య, రాజయోగిని బి.కె. సరోజినీ, రాజ యోగిని బి.కె. జ్యోతి, బి.కె. గణేష్, బి.కె. నాందేవ్, బి.కె. నరేందర్ సభ్యులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయం అభివృద్ధికి కృషి

**ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రామంతాపూర్ శ్రీరమణపురంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం అభివృద్ధి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి దాత తెల్కల మోహన్‌రెడ్డి దంపతులు స్లాబు వేయించారు. ఈ సందర్భంగా పనులను పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఆలయంలో భక్తులకు వివిధసేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పి.రాఘవేందర్, పూస శ్రీనివాస్, సత్తిరెడ్డి, లుకాస్, సుధాకర్, జి.పాండు, బండారి వెంకటేష్, శ్రీనివాస్, అద్దంకి యాదగిరి, సుంకరి సంతోష్, బాబురావు, సాయిబాబా, రాజు,లింగస్వామి, ఆలయ కమిటి నేతలు నరసింహారెడ్డి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

## ముగిసిన కన్యకా పరమేశ్వరి ఆలయం బ్రహ్మోత్సవాలు



వాసవీ కన్యకాపరమేశ్వరి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఉప్పల శ్రీనివాసగుప్త, రాజమౌళిగుప్త తదితరులు

**రామంతాపూర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం 37వ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ట్రస్ట్, ఆర్యవైశ్య సంఘం చైర్మన్ గంజి రాజమౌళిగుప్త, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్త, అధ్యక్షుడు బోనగిరి శ్రీనివాసులుగుప్త, కోశాధికారి పూరే నగేష్‌గుప్త, సహాయ ప్రధాన కార్యదర్శి యెనిశెట్టి కొండయ్యగుప్త, శంభు పాండయ్యగుప్త, కొత్తపల్లి రమేష్‌గుప్త, పల్లెర్ల బిక్షపతిగుప్త, బోనగిరి శ్రవన్‌కుమార్‌గుప్త, జిల్లా హరిబాబుగుప్త, దారం వెంకటేష్‌గుప్త, విశ్వనాధ మంజునాధగుప్త, బెజగం రాజుగుప్త, మంచాల వీర ప్రకాష్‌గుప్త, బురుగు రమేష్‌గుప్త, మహిళా విభాగం అధ్యక్షురాలు సంబు జయమ్మ, బోనగిరి పద్మ, విశ్వనాధ సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో ఉదయం సుప్రభాతం, నిత్య పూజ, రుద్రాభిషేకం, అర్చన, అలంకారములు, చండీహోమం, బలిహారణము, పూర్ణాహుతి, కలశోధ్వాసన, మహానివేదన, మంత్రపుష్పం, మహద్వాశీర్వచనము నిర్వహించారు. ప్రధాన పూజారి రేపాక కళానిధిశర్మ, శ్రీనివాసాచార్యులు, జితేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### డిఈఈ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రవీందర్‌నాయక్

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధన కోసం తనవంతు కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దారవత్ రవిందర్ నాయక్ తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్‌లో ఇంజనీర్ల యూనియన్ ఎన్నికలు ఏక గ్రీవంగా జరిగాయి. రాష్ట్ర అధ్యక్షులుగా రవిందర్ నాయక్,కార్యదర్శిగా సి.హెచ్.భగవంతరావ్, కోశాధికారిగా వి.కాశీనాథ్‌లు ఎన్నికైయ్యారు.



# లక్ష్మీగణపతి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఆర్టీసీ క్రాస్ రోడ్ శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ ఏర్పాటు అయిన సందర్భంగా ప్రమాణ స్వీకారం, సన్మాన కార్యక్రమం ఆదివారం ఆలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, బిఆర్ఎస్ యువనేత ముఠా జై సింహ, కాంగ్రెస్ నాయకుడు అరవింద్‌కుమార్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ హాజరై నూతనంగా ఎన్నికైన కమిటీని అభినందించి ప్రసంగించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కమిటీ చైర్మన్ మారిశెట్టి నరసింగరావు, ఈవో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లక్ష్మీ గణపతి దేవాలయం అభివృద్ధికి తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జిల్లా శివకుమార్, మీసాల రాజేష్, డి భానుచందర్, గడప భాగ్య లక్ష్మి, సాయికీర్థ్, గిరిబాబు, గుర్రం దినేష్, బద్రి నవీన్‌కుమార్, పి.సురేష్‌యాదవ్,గుండ్ల గజానంద్, ఎం గణేష్, జి లలిత, రామకృష్ణ, జి శ్రీనివాస్, కే శివకుమార్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ తదితరులను సత్కరించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శీలం సత్యనారాయణ, యాదగిరి గౌడ్, జయేంద్ర బాబు, సంజీవరెడ్డి, నర్సింగ్ ముదిరాజ్, సురేష్ ,గుర్రం శంకర్ ,గుండు జగదీష్ బాబు, అభిషేక్ కెన్నడీ, నరేంద్ర యాదవ్ ,శంకర్ గౌడ్, వీడి, కృష్ణ, బిఆర్ఎస్ నాయకులు ఎం రాకేష్ కుమార్, పున్నా సత్యనారాయణ, గడ్డమీది శ్రీనివాస్, సుధాకర్, కుమారస్వామి, ఆనంద్, బిజెపి నాయకులు రత్నా సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.





ఫ్రీ మెగా హెల్త్‌క్యాంపులో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి,వైద్యులు

### వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్

**మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శివరాంపల్లిలోని ప్రజా భవన్‌లో ఆదివారం జనతా హృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన డాక్టర్ హనుమంత్ రెడ్డి,డాక్టర్ ఎం.మేధినీ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు వల్ల పేద ప్రజలకు ఎంతో ఉపయోగం కలుగుతుందని, ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు ఆయన ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు.

## గాంధీనగర్‌లో బిజెపి సంబురాలు



టపాసులు కాలుస్తున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్ తదితరులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఢిల్లీలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించడంతో కాషాయ ప్రభంజనం మొదలైందని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్ అన్నారు. ఆదివారం డివిజన్ బిజెపి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆంధ్రాకేఫ్ చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అవినీతి, అసమర్థ ఆప్ ప్రభుత్వాన్ని ఇడ్చి పారేసిన ఢిల్లీ ప్రజలు, సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్... నినాదం తో దేశ ప్రజలకు సేవ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ బీజేపీ పార్టీకి భారీ మెజారిటీతో విజయాన్ని అందించారన్నారు. ఈ విజయం బీజేపీ నాయకులు,కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందని,రెట్టింపు ఉత్సాహంతో ఢిల్లీ విజయాన్ని స్ఫూర్తి గా తీసుకొని బిజెపి ఈ సారి గ్రేటర్ హైదరాబాద్ మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, వివిఎస్‌టి.రాజు, ఎం.ఉమేష్, మహమూద్, సత్తి రెడ్డి, ప్రకాష్ యాదవ్,పాల శ్రీనివాస్,మదన్మోహన్, నర్సింహ,శ్రీనివాస్,సాయి కుమార్, ఆనంద్ రావు,సాయి కృష్ణ యాదవ్, సత్యేంధర్,యాదగిరి, రఘు యాదవ్,నీరజ్, మంగమ్మ,సంధ్యా రాణి, పూర్ణ, సంయుక్త రాణి,కృష్ణ వేణి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా నాదర్‌గుల్ విజ్ఞాన్ ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ వార్షికోత్సవం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్‌లో నున్న విజ్ఞాన్ ఇంటిగ్రేటెడ్ హై స్కూల్ 23వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత మర్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకులు బంగారు అశోక్, దిండు శ్రీనివాస్‌గౌడ్, పెద్దబావి మౌనిక సుదర్శన్‌రెడ్డి, గిరి ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, చల్లా నర్సింహారెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి తదితరులు





కార్యక్రమంలోపాల్గొన్న కేశవ స్మృతి సంవర్ధన బాలయ్య, కొల్లి నాగేశ్వరరావు

### యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి : బాలయ్య

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తు వారి భవిష్యత్తుకు పునాది వేయాల్సిన బాధ్యత స్వచ్ఛంద సంస్థలపై ఉందని కేశవ స్మృతి సంవర్ధన సమితి ప్రధాన కార్యదర్శి కొప్పరపు బాలయ్య అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలలో కేశవ స్మృతి సంవర్ధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలలో ఒకటైన కారు డ్రైవింగ్ శిక్షణ పొందిన ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ అధినేత కె.ఉపేందర్ నేతృత్వంలో కారు డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలయ్య ఈ సేవా కార్యక్రమం యువతకు ఉపాధి అవకాశాలను అందిస్తూ వారి భవిష్యత్తుకు దారి చూపుతుందని నమ్మకం కలిగిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలు తెలుపుతూ తనవంతు ఇలాంటి సేవా కార్యక్రమాలకు తప్పక సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, రామచంద్రజీ, కొల్లి నాగేశ్వరరావు, ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ అధినేత ఉపేంద్ర, బిజెపి నేతలు ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### నేడు కిషన్‌బాగ్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 10వ తేదీ సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటలు వరకు కిషన్ బాగ్, నజమానగర్, ఎస్‌పి నగర్,హర్షమహల్,సిక్‌చావనీ ప్రాంతాలలో,12 నుంచి 2 గంటలువరకు అల్లామసీదు,కొండారెడ్డిగూడ,కిషన్‌బాగ్, బోజారెడ్డి నగర్, 2 నుంచి 5 గంటలు వరకు అసద్ బాబానగర్,కిషన్‌బాగ్,మహమూద్‌నగర్ బస్తీలలో విద్యుత్‌సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు వెల్లడించారు.

### భీమ్‌రెడ్డి సేవలు మరువలేనివి: జిల్లెల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఎమ్మార్వోగా, ఆర్డీవోగా, యుఎల్‌సి కమీషనర్‌గా రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం పాటు పని చేసిన నందిగామ భీమ్‌రెడ్డి అందించిన రెవెన్యూ సేవలు మరువలేనివని పూర్వ సరూర్‌నగర్ మండల పరిషత్ ప్రప్రథమ అధ్యక్షుడు (ఎంపిపి) జిల్లెల కృష్ణారెడ్డి అన్నారు. గుండెనొప్పితో భీమ్‌రెడ్డి మృతి చెందారనే విషయం తెలుసుకున్న జిల్లెల కృష్ణారెడ్డి అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొలశెట్టి లక్ష్మయ్య, పలువురు రిటైర్డ్ ఆర్డీఓలు, ఎమ్మార్వోలు, రెవెన్యూ ఉద్యోగులు ఆదివారం దిల్‌సుఖ్‌నగర్ కమలానగర్‌లోని భీమ్‌రెడ్డి నివాసానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు భీమ్‌రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించి ఆయన కుమారుడు నారాయణరెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లెల కృష్ణారెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో వివాదరహిత అధికారిగా భీమ్‌రెడ్డికి పేరుందని కొనియాడారు. అదే విధంగా పలువురు విశ్రాంత రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు భీమ్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.

## బిఆర్ఎస్ పాలనలో సిసి కెమెరాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత: సబితారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 26వ డివిజన్ కిందకు వచ్చే గుర్రంగూడ గడ్డం ఎన్‌క్లేవ్ ఫేస్-1 కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి కాలనీవాసులతో కలిసి సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు స్వంతంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో సిసి కెమెరాల ఏర్పాటుకు నాటి సిఎం కెసిఆర్ ఎంతో ప్రాధాన్యతనిచ్చారని ఆమె వెల్లడించారు. హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసిన ఘనత కూడా బిఆర్ఎస్‌దేనని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం పోలీసు వ్యవస్థను పటిష్టం చేశారని మాజీ మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, గుర్రంగూడ మాజీ కౌన్సిలర్ గుర్రం సాయికిరణ్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఇఎల్‌వి సమైక్య జ్యోతి అశోక్, అల్మాస్‌గూడ మాజీ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యాల కృష్ణలతో పాటు గుర్రంగూడ బిఆర్ఎస్ నాయకులు, గడ్డం ఎన్‌క్లేవ్ కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.



సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కొలన్ శ్రీనివాస్ రెడ్డి

### ఘనంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి జాతర

**నిజాంపేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి 124వ వార్షికోత్సవ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ జాతర మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మల్లికార్జున స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లీడర్ నరసింహారెడ్డి, మేకల వెంకటేష్, కొలన్ లక్ష్మారెడ్డి, శ్రీశైలం యాదవ్, రాజమోహన్ రెడ్డి, సత్తిరెడ్డి, వెంకట్ రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన

**ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆదివారం ఉప్పల్ చౌరస్తాలో వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ జి.నాగరాజు మాట్లాడుతూ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. డ్రైవ్ సేఫ్ హైదరాబాద్ టీమ్ నిర్వహకులకు లోకేంద్రసింగ్, టాప్ డ్రైవర్ ఇండియా నరేష్, రాఘవన్ తదితరులతో కలిసి వాహనదారులు హారన్ వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. రద్దీ ప్రాంతాల్లో హారన్ ఉపయోగించవద్దని, శబ్ద కాలుష్యం వల్ల ఇబ్బందులు ఉంటాయని వివరించారు. పోలీసుల సహకారంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### సీనియర్ సిటిజన్ క్లబ్‌కు చేయూత : పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో సీనియర్ సిటిజన్స్ క్లబ్‌కు అండగా ఉంటానని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉప్పల్‌లోని ఆయన నివాసంలో పలువురు సీనియర్ సిటిజన్ ప్రతినిధులు కలిసి సమస్యలు విన్నవించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌క్లబ్‌కు ఇప్పటికే 400 గజాల స్థలం కేటాయించామని, క్లబ్‌లో మౌళిక వసతుల కోసం రూ.20లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఉప్పల్ ప్రధాన రహదారిలో సీనియర్ సిటిజన్స్‌క్లబ్‌కు స్థలం కేటాయించామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు మేకల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్, మనోహర్, కుమారస్వామి, నారాయణగౌడ్, విజయ్‌కుమార్, ఎల్.నరసింహారెడ్డి, మందముల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం కార్యదర్శి జాన్ వెస్లీకి సత్కారం



జాన్ వెస్లీని సత్కరిస్తున్న ఉప్పల్ సిపిఎం పార్టీ నేతలు

**ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** సిపిఎం కార్యదర్శి జాన్‌వెస్లీ ఆదివారం ఉప్పల్‌లోని పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, రాష్ట్ర నాయకులు శ్రీరామ్ నాయక్, హిమబిందు, జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు ఎం.వినోద, రాజశేఖర్, ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న, కమిటి సభ్యులు ఊర్మిళ, లలిత, నాగరాజు, శేషు, భీష్మాచారి, వై.వెంకటేశ్వర్లు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఉప్పల్‌లో సిపిఎం పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు మురళీమోహన్, పట్టాభిరామయ్య, వెంకటేష్, కుమార్, పరుశరామ్, బాలయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

### కార్టూన్ పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్టూన్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేయబోతున్నట్లు నిర్వాహకసంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుదిబండి వెంకటరెడ్డి, వి.వి.రాఘవరెడ్డి వివరించారు. 12న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగే కార్యక్రమంలో పోటీలలో ముఖ్యఅతిథిగా హాజరయ్యే దక్షిణమధ్యరైల్వే విశ్రాంత జీఎం సి.రామకృష్ణ చేతులమీదుగా విజేతలుగా నిలిచిన హైదరాబాద్‌కు చెందిన అరుణ్, కామేశ్, లేపాక్షి, మోహన్‌కుమార్, విజయవాడకు చెందిన పద్మ, నాగిశెట్టి, వైజాగ్‌కు చెందిన కశ్యప్, పెనుగొండకు చెందిన గోపాలకృష్ణ, వనపర్తికి చెందిన శేషిరెడ్డి, అమరావతికి చెందిన కుష్మితలకు నగదు పురస్కారాలను అందించబోతున్నట్లు వివరించారు. సభకు పారిశ్రామికవేత్త డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహిస్తారని, కార్యక్రమంలో యువకళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మినారాయణ, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, తెలుగు విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు నిర్మలాప్రభాకర్, హాస్యానందం సంపాదకులు పి.రాము, కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు పాల్గొంటారన్నారు. నిర్మలాప్రభాకర్ శిష్య బృందం ఆధ్వర్యంలో 'భరతనాట్యం-అభినయం' ఉంటుంది.

### ఆలయంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేస్తాం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో వెండితో గర్భాలయం నిర్మాణ కార్యక్రమాన్ని త్వరలో పూర్తి చేస్తామని ఆలయం చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం వివరించారు. ఆలయంలో 187 కేజీలతో గర్భాలయములకు చౌకోట్లు, ద్వారములకు వెండి నగిషీ రేకుతో తొడుగులు తయారు చేయడానికి అవసరమైన టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. దేవస్థానం మండపంలో దేవాదాయ శాఖ స్థపతి, సహాయక కమీషనర్ దేవాదాయ శాఖ, కమిటీ చైర్మన్, ఈవో, ధర్మకర్తల సమక్షంలో టెండర్లను తెరిచారు. ఇందులో నగరానికి చెందిన స్వర్ణ హాండిక్రాఫ్ట్స్, ఎ.జగదీశ్వర్, బాలాజీ సిల్వర్ వర్క్స్, రామకృష్ణ జువెల్లర్స్ అండ్ స్మిత్స్ పాల్గొనగా తక్కువగా ప్రైస్‌బిడ్ కోట్ చేసిన రామకృష్ణ జువెల్లర్స్‌కు 187 కేజీలతో గర్భాలయములకు చౌకోట్లు, ద్వారములకు వెండి నగిషీ రేకుతో తొడుగులు తయారు చేయడానికి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు బి. పద్మావతి, ఎం. నిర్మల, ఎస్.నేత రాణి, కె.సుబ్బారావు, వివిఎస్.కుమార్, వి.శ్యామ్ కుమార్, ఎం. గణేష్, బాలాకుమార్, స్థానికులు సాయి చంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఎర్రకుంట పటేల్ కుంట చెరువులో పేరుకుపోయిన

## గుర్రపు డెక్కలను తొలగించాలని వినతి

**నాచారం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** నాచారం ఎర్రకుంట పటేల్ కుంట చెరువులో గుర్రపు డెక్క పెరుగడంతో దోమలు వ్యాపించడంతో పాటు దుర్వాస వస్తుందని ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఇదివరకు చెరువులో నుండి తొలగించిన గుర్రపు డెక్కన్ చెరువు కట్టపై వేసి వదిలేయడంతో పక్కనే ఉన్న ఎరుకల బస్తీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టాలని స్థానిక బస్తీ వాసులు కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ గారికి వినతి పత్రం అందజేశారు. తొందరలోనే గుర్రం డెక్కలను తొలగించి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జీవన్ కుమార్, అనంతచారి, సయ్యద్ ఇబ్రాహీం, సత్తార్,సలీం, రబ్బాని, రమేష్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కమలప్రసాదరావు రూపొందించిన కళాఖండాలు అద్భుతం



ఆర్ట్ గ్యాలరీ కేంద్రాన్ని సందర్శించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ప్రముఖ కళాకారిణి పి.కమలప్రసాదరావు రూపొందించిన కళాఖండాలు అద్భుతంగా ఉన్నాయని వక్తలు కీర్తించారు. ఆదివారం కమలాప్రసాదరావుకు చెందిన 'హర్ ఆర్ట్ గ్యాలరీ' కేంద్రాన్ని ప్రవాసభారతీయులు, సాఫ్ట్‌రంగ నిపుణులు రాజమోహన్‌రెడ్డి, అనుపమ, రాజమోహన్‌రెడ్డిలు సందర్శించారు. అద్భుతమైన కళారూపాలు ఎంతో గొప్పగా ఉన్నాయని ప్రశంసించారు. కమలాప్రసాదరావు రూపొందించిన కళాఖండాలన్నీ 'అందాల హరివిలు'గా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమలాప్రసాదరావును సత్కరించి అభినందించారు. రంగుల హరివిల్లుగా ఆర్ట్ గ్యాలరీ ఉందని, నిత్యం సందర్శకులతో శోభాయ మానంగా విలసిల్లుతోందని, అన్నారు. కళా కారిణి, డైరెక్టర్ వినూత్న విచిత్ర చిత్ర కల్పనా విశారద" పి.కమల ప్రసాదరావుని శాలువ, మెమొంటోతో సన్మానించారు. ఇదే కార్యక్రమంలో ఇతర ప్రముఖులు, విశ్రాంత అధికారులు శషి భూషణ,శర్మ, మోహన, కుల కర్ణి, జాతీయ క్రీడా కారులు రామ్మోహన్, రాంబాబు తదితరులు సందర్శించారు. కార్యక్రమంలో హర్ ఆర్ట్ గ్యాలరీ చైర్మన్, సంస్కృతిరత్న కె.ధర్మారావు, మేనేజింగ్ డైరెక్టర్ పి.వి.యస్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేసిన అమర్‌సింగ్

# బిజెపిని మరింత బలోపేతం చేయాలి

### కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఠాకూర్ అమర్‌సింగ్

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** సమన్వయంతో పని చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని బిజెపి కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఠాగూర్ అమర్‌సింగ్ కార్యకర్తలకు హితబోధ చేశారు. కార్యకర్తలే పార్టీకి బలమైన పునాదులన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు టి.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడంతోపాటు వారికి ఠాగూర్ అమర్‌సింగ్, బిజెపి సీనియర్ నాయకులు జి.సునీల్‌యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గుడిమల్కాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీలుగా వెంకటేష్ జోషి, ఏ.మల్లేష్‌యాదవ్, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా అంబికా సాగర్, ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా మామిడి వెంకటేష్ ల ను నూతనంగా నియమించడం జరిగింది. అనంతరం ఠాకూర్ అమర్ సింగ్ మాట్లాడుతూ...పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. సరైన సమయంలో వారికి గుర్తింపు ఇస్తూ పార్టీ బాధ్యతలను అప్పజెప్తుందని గుర్తు చేశారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న ప్రతి నాయకుడు సమన్వయంతో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించినప్పుడే ప్రజల నుంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లంగర్‌హౌస్‌లో బిజెపి నేతల సంబరాలు

### భారీ ర్యాలీ, స్వీట్లు పంపిణీ, టపాసుల మోత



లంగర్‌హౌస్ డివిజన్‌లోని గాంధీ విగ్రహం వద్ద బిజెపినేతల సంబరాలు

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించడంతో కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ లో ఆపార్టీ నేతలు సంబరాలు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు దుమ్మటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని బాబు జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాల నుంచి టపాసులు కాలుస్తూ భారీ ర్యాలీగా గాంధీ విగ్రహం వరకు చేరుకొని స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బిజెపి నాయకులు చెరుకుల ఉదయ్‌కుమార్, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అల్వాల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ... ఢిల్లీలో 27 సంవత్సరాల తర్వాత బిజెపి పార్టీ అధికారంలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో నాయకులు ఆకుల గోవర్ధన్, కాంత అర్చన్‌కుమార్, వినేష్‌సింగ్ ఠాకూర్, పూర్ణచంద్రరావు, శ్రీనివాస్, గోపిరెడ్డి నాగేంద్ర ప్రకాష్‌రెడ్డి, కేంసారం సరళ, గోపాల సంజయ్, జెన్న సుధాకర్, బలవంతరావ్, సంతు జ్ఞానేశ్వర్, నితీష్‌రెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు సైన్స్‌ఫేర్ : ఎమ్మెల్యే శ్రీగణేష్



బోయిన్‌పల్లిలో సైన్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు సైన్స్ ఫేర్ ఎంతో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. 6వ వార్డు సీతారామ్‌పూర్‌లోని వాణి కాన్వెంట్ లిటిల్ లిల్లీహైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫేర్‌ను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ సైన్స్‌ఫేర్లు ఏర్పాటు చేయడంవల్ల విద్యార్థులకు జ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మంజుల వాణిలు పాల్గొన్నారు.

**అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ...**

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 5వ వార్డు ఓల్డ్ వాసవి నగర్, సీతారామ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న కార్యక్రమాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్ గుప్త, కాలనీ ప్రతినిధులు నరిసింహులు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ ఒకరి సొత్తు కాదు

### టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్



కావడి జిషితకు సన్మానిస్తున్న బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**మెహిదీపట్నం, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త :** ప్రతిభ ఒకరి సొత్తు కాదని, ప్రతిభ ఉన్నవారు ఏరంగంలోనైనా రాణించగలుగుతారని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్‌లో లంగర్‌హౌస్ డివిజన్‌కు చెందిన కావడి జిషిత పాల్గొని సిల్వర్ మెడల్ సాధించడంతో ఆదివారం బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆమెకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కూరాకుల కృష్ణ, జపాన్ కరాటే అకాడమీ మాస్టర్ దయానంద్ కుమార్‌లు ఉన్నారు.

**జగన్‌కు అండగా ఉంటా: ఎమ్మెల్యే**

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ ఉద్యమకారుడు, టిఆర్ఎస్ నాయకులు ముచ్చింతల జగన్‌కు అన్ని విధాలుగా అండగా ఉంటానని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గుండెపోటు స్టంట్ వేయించుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జగన్‌ను సబితాఇంద్రా రెడ్డి ఆదివారం ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే గుండెపోటు రావడం బాధాకరమన్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ టిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి అరవింద్‌శర్మ, సాజిద్, వెంకటేష్‌గౌడ్, పెంబర్తి శ్రీనివాస్ ఉన్నారు.

# క్రీడా పోటీల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

### ఎమ్మెల్యే వివేకానంద

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** క్రీడలలో గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరిస్తూనే ఓటమి చెందితే పట్టుదలతో గెలిచే వరకు కృషిచేయడం గెలిస్తే దానికి కాపాడుకునేందుకు నిరంతర సాధన ముఖ్యమని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద అన్నారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టస్మా) లిటరల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకలు కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, నర్సిరెడ్డి, కోశాధకారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరితో కలిసి ఆయన పాల్గొని వివిధ క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటమిలను సమానంగా తీసుకుని ముందుకు సాగే అవకాశం కేవలం క్రీడలోనే విద్యార్థులు నేర్చుకునే అవకాశం వుందన్నారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టస్మ) రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ మండలంలో అతిపెద్దక్రీడా మైదానంగా కుత్బుల్లాపూర్ గ్రౌండ్‌ను గుర్తించి విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడేలా బహుకరించాలని విజ్ఞప్తిచేశారు.

ట్రస్మా ఉపాధ్యక్షులు వనజ మాట్లాడుతూ హాట్రిక్ శాసనసభ్యులుగా ఎన్నికై టిఆర్ఎస్ అసెంబ్లీ విప్‌గా నియమించబడటం యావత్ తెలంగాణలోనే అత్యధిక మెజార్టీ గెలు పొంది గర్వపడేలా చేసిందని కొనియాడారు. అనంతరం టస్మా ప్రతినిధులు శాసనసభ్యులు కె.పి. వివేకానంద్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశంలో శ్రీవిద్య సంస్థల చైర్మన్ విశ్వనాథ్ చారి, కుత్బుల్లాపూర్‌కు చెందిన ప్రైవేట్ పాఠ శాలల ప్రతినిధులు పాల్గొన్నారు.



మహాబుద్ధవిహార్‌లో త్రీపీటిక గ్రంధ పఠనం వేడుకల్లో పాల్గొన్న బౌద్ధ బిక్షులు

### మహా బోధి బుద్ధ విహార్‌లో త్రీపీటిక గ్రంథాన్ని ఆవిష్కరించిన బౌద్ధ బిక్షువులు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** బుద్ధుని బోధనలు,ప్రవచనాలు ప్రజలకు వివరించేందుకు త్రీపీటిక గ్రంథం ఎంతగానో ఉపయోగపడుతుందని అమెరికా దేశానికి చెందిన వాము డిక్సీ, బ్రెజిల్ దేశానికి చెందిన నెల్సన్‌లు పేర్కొన్నారు. ఆదివారం సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లోని మహాబోధి విహార్ ప్రాంగణంలో మొదటిసారిగా నిర్వహించిన త్రీపీటిక గ్రంధ పటణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు థైలాండ్, కాంబోడియా, వియత్నాం, లావోస్, శ్రీలంక, దేశ విదేశాలకు చెందిన 150 మంది బౌద్ధ క్షువులు పాల్గొని, బుద్ధుని మార్గదర్శకాలను విషదీకరించారు. బుద్ధుని కాలంలో బోధనలుగా ప్రవచనాలుగాప్రజలకు వివరించిన పలు అంశాలను త్రీపీటిక గ్రంథంలో పొందుపర్చడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక కార్పోరేషన్ మహాబోధి సొసైటీ లైట్ ఆఫ్ బుద్ధ, ధర్మ పౌండేషన్, ఇంటర్నేషనల్ త్రీపీటిక చాటింగ్ కౌన్సిలింగ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బౌద్ధ బిక్షువులు కసప్పా, బుద్ధ విహార్ నిర్వాహకులు బుద్ధపాల చేత తదితరులు పాల్గొన్నారు.

### సిఎం రేవంత్ రెడ్డికి మాదిగలు రుణపడి ఉండాలి : దేవుడు



సిఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాల నుంచి పోరాటం చేసేస్తున్న ఎమ్మార్పీఎస్ చేపట్టిన సామాజిక న్యాయమైన అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం చరిత్రపుటలో నిలిచిందని బోయిన్‌పల్లి మార్కెట్ వైస్ చైర్మన్,కాంగ్రెస్ నేత డి.బి.దేవేందర్ (దేవుడు) తెలిపారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేసి నందుకు సంతోషం వ్యక్తం చేసుస్తూ ఆదివారం పికెట్ లక్ష్మి నగర్‌లో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సత్య నారాయణ, అశోక్, రాఖేశ్ తదితరులు పాల్గొన్నారు.

# భావోద్వేగానికి దూరంగా ఉండాలి

### అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** జీవితంలో ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలంటే ఒత్తిడి, బలహీనత, భావోద్వేగాలకు దూరంగా ఉండాలని అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం కేర్ హాస్పిటల్ హైటెక్ సిటీ, టీసీఓఎస్, టీఓఎస్ఏ, అడ్వకేట్ వాలంటీర్లు బేసిక్ లైఫ్ సపోర్ట్, కార్డియోపల్మోనరీ రిససిటేషన్ అనే అంశంపై న్యాయవాదులకు వర్క్‌షాప్, శిక్షణా తరగతులను నిర్వహించారు.వర్క్‌షాప్‌కు సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై న్యాయవాదులు ఒత్తిడి లేని జీవితాన్ని ఎంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. న్యాయవాదిగా ఉండటం వల్ల కోర్టులో కేసులకు సంబంధించి ప్రతిరోజూ కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, న్యాయస్థానాల్లో కేసులను న్యాయబద్ధంగా విచారించాలంటే ఒత్తిడి, భావోద్వేగాల ప్రభావాన్ని ఎలాగైనా నివారించాలని ఏజీ సుదర్శన్‌రెడ్డి న్యాయవాదులకు ఉద్బోధించారు.వర్క్‌షాప్‌లో తెలంగాణ బార్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యుడు శ్రీ బన్నూరు కొండారెడ్డి మాట్లాడుతూ కార్డియాక్ అరెస్ట్ కారణంగా పెరుగుతున్న మరణాల సంఖ్య గురించి ఇటీవలి నెలల్లో న్యాయవాదులు మరియు మరణాలపై విచారం వ్యక్తం చేశారు. బిఎల్ఎస్ సిపిఆర్‌పై వర్క్‌షాప్ నిర్వహించేందుకు చొరవ తీసుకున్న కేర్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మరియు వైద్యులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కేర్ హాస్పిటల్ హైటెక్ సిటీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వేల్పుల జగన్ మోహన్ రెడ్డి, గవీళీతి ప్రెసిడెంట్ మరియు ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ వై. తిమ్మారెడ్డి, తెలంగాణ హైకోర్టు జీపీ ఫర్ హోమ్ శ్రీ మహేష్ రాజే, తిలీతిదిళీ డైరెక్టర్లు తోర్నాల గిరి, ఆర్మూల మహేశ్వర్ మరియు ఇతర వైద్య నిపుణులు ఆరోగ్యం మరియు ఒత్తిడి లేని జీవితం గురించి నొక్కిచెప్పారు.అనంతరం వర్క్‌షాప్‌లో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

### మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లో కరాటే గ్రేడింగ్ బెల్టుల ప్రదానం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని ప్రశాంతిహిల్స్‌లో సన్ పవర్ కరాటే అకాడెమీ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలను నిర్వహించారు. మాస్టర్ చందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి మాజీ కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్ బెల్టులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డి.కృష్ణ, సిద్దేశ్వర్, వెంకట్‌రావు, వెంకటేష్ పటేల్, ప్రభాకర్, కడప వెంకటేశ్, రఘు, జంగారెడ్డి, చందర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో పాల్గొన్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

### రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో బిజెపి సంబరాలు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ శనివారం బిజెపి ఎస్సీ మోర్చా కన్వీనర్ చిన్న వీరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంబరాల్లో మోండా డివిజన్ కార్పొరేటర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొని బాణ సంచాలు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొంతం నరేశ్, బాలనరిసింహా, రవి, శంకర్,బాస్కర్,కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

**తుకారాంగేట్ చౌరస్తాలో...**



తుకారాంగేట్ చౌరస్తాలో సంబరాలు చేసుకుంటున్న బిజెపిశ్రేణులు

**అడ్డగుట్ట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచన విధానంలో బిజెపి విజయం సాధించిందని అడ్డగుట్ట డివిజన్ బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య తెలిపారు. ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి అఖండ విజయం సాధించినందుకు శనివారం రాత్రి తుకారాంగేట్ చౌరస్తాలో బిజెపి శ్రేణులు బాణ సంచాలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు క్రిష్ణ, వి.నరిసింగ్‌రావ్, సాయి, రాజారామ్, శివలింగం, హంసరాజ్,వీరేశం శివాజి, సాయన్న, దిలీప్,రాజు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

**ఉప్పల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం శృతి లయ డాన్స్ అకాడమీ గురువు మంజు మోహిని శిష్య బృందంచే కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా రోహిణి, శాంతి, నళినాక్షి, హాసిని, అనన్య తదితరులు కళింగ నర్తన, నాట్య హెల్త్, కోలువై ఉన్నడే, జయజయ దుర్గే, మూషిక వాహన, రామాయణ శబ్దం, భో శంభో, తిల్లాన, బ్రహ్మమొక్కటే, వినాయక కౌతం, కొలువైతివారంగా, సాయి నమశ్శివాయతే, బ్రహ్మాంజలి, అర్ధనారీశ్వరం, భామా కలాపం, బృందావన నిలయే, ఒకపరికొకపరి దశావతారం, జనుత శబ్దం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

### ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తున్న మోదీ ప్రభుత్వం : హరగోపాల్

**సైఫాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసి) చట్టబద్ధమైన స్వతంత్ర సంస్థ అని, కేంద్రం తన సొంత ఎజెండా అమలు పరిచేందుకు కీలు బొమ్మలా ఆడిస్తూ వర్సీటీల ప్రమాణాలను దిగజార్చే నిర్ణయాలను చేస్తున్నదని ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆరోపించారు. ఈ పద్ధతి ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని, వర్సీటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ తీసుకువచ్చిన యూసిసి నూతన మార్గదర్శకాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'యూజిసి 2025 నిబంధనలు–విశ్వవిదాయలయాల స్వయం ప్రతిపత్తిపై దాడీ' అనే అంశంపై జరిగిన జాతీయసదస్సులో హరగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ సి.కాశీం, ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దినేష్ సిరంగరాజ్, రామకృష్ణ పాండ, మాజీ ప్రధానకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జాతీయ ఉపాధ్య క్షుడు ఎన్.ఎ.స్టాలిన్ పాల్గొని ప్రసంగించారు. హరగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలో అభివృద్ధి నినాదంతో మూడవసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం అభివృద్ధిని పక్కనబెట్టి ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే విధంగా పాలన సాగిస్తున్నదని ధ్వజమెత్తారు. సంస్కరణల పేరుతో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఆచార్యుల నియామకాలు, పదోన్నతుల కోసం కనీస అర్హతలు చూడటం లేదని ఆరోపించారు.



మాట్లాడుతున్న హరగోపాల్

# సెంట్రల్ స్పౌజ్‌లోనూ బదిలీలు చేయాలి

**సైఫాబాద్, ఫిబ్రవరి 9ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, తెలంగాణ ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులు భార్యభర్తలు (స్పౌజ్) ఒకే చోటకు బదిలీ చేయాలని తెలంగాణ సెంట్రల్ స్పౌజ్ ఫోరం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి జాదవ్, కోశాధికారి రవీందర్, సంయుక్త కార్యదర్శి నారాయణ, మహిళ అధ్యక్షురాలు శైలజ, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు మాట్లాడుతూ.. భర్త రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తూ, భార్య కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తూ ఉండేవారిని, అలాగే భర్త రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో, భార్య కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేయడం వల్ల వారిని స్పౌజ్ బదిలీలకు పరిగణించకపోవడం వల్ల తెలంగాణ స్థానికత కలిగి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి స్థానిక క్యాడర్ కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జివొ నెంబరు 317లో కొన్ని సవరణలు చేసి 854 మంది రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ ఉద్యోగులను ఒకే చోటకు బదిలీ చేసిందని చెప్పారు. కాగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులను మాత్రం ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా కేంద్ర ప్రభుత్వ రంగ ఉద్యోగ, ఉపాధ్యాయులు 317 జివొపై క్యాబినెట్ సబ్ కమిటీని కలిసి అనేకసార్లు వినతి పత్రాలను సమర్పించడం జరిగిందన్నారు. తిరిగి క్యాబినెట్ సబ్ కమిటీ సానుకూలంగా స్పందించి, రాష్ట్ర సెంట్రల్ స్పౌజ్‌ను కూడా స్టేట్ స్పౌజ్ ఏవిధంగా బదిలీలు చేశారో అదే విధంగా చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ హామీని సిఎం రేవంత్‌రెడ్డి మానవతా దృక్పథంతో అమలు చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో వెంకటాచారి, సంఘమిత్ర, కవిత పాల్గొన్నారు.



రంగనాథ్‌ను సన్మానిస్తున్న లైన్స్‌క్లబ్ సభ్యులు

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సన్మానం

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** పేదలకు అండగా నిలుస్తూ నిరంతరం సేవాకార్యక్రమాలకు కొనసాగించాలని హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్ పేర్కొన్నారు. పటేల్ రీజియన్ మీట్ కార్యక్రమంలో ఆదివారం హైడ్రా కమిషనర్‌ను సన్మానించిన మిరియాల దంపతులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రంగనాథ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పటేల్ రీజినల్ క్లబ్ మీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. అన్ని వర్గాల ప్రజలకు సేవ చేసేందుకు ఈ క్లబ్ అగ్రభాగాన ఉండాలని ఆకాంక్షించారు. మానవసేవే మాధవసేవ అనే దానికి ఈ క్లబ్ ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవి. రంగనాథ్‌ను పటేల్ రీజియన్ చైర్ పర్సన్ మిరియాల చంద్రమోహన్, ఫస్ట్ లేడీ ఆఫ్ రీజియన్ వినయలత దంపతులు మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### వనస్థలి హిల్స్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కాలనీవాసులు ఆరోగ్య సంరక్షణను దృష్టిలో పెట్టుకొని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని వనస్థలి హిల్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్‌రెడ్డి యాదిరెడ్డి పేర్కొన్నారు. వనస్థలిహిల్స్ కాలనీలో ఆదివారం నాగోల్ సుప్రజా ఆసుపత్రి బిజిఎం ఏవి.రావు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదిరెడ్డి, ప్రధానకార్యదర్శి కృష్ణమోహన్ హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు కాజా దుర్గాప్రసాద్, జి.శ్రీనివాసరావు, ఎంవి.రామారావు, చల్లూరి సుధాకర్‌రెడ్డి, వాసుదేవరావు, ఆసుపత్రి కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, డాక్టర్ స్వర్ణ, కార్తికేయన్, శబ్నం, మనీ, శంకర్, సోనీ, స్రవంతి పాల్గొన్నారు.

### మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి:ఉప్పల

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఐవిఎఫ్ అధ్యక్షుడు, పర్యాటకశాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడ సహభావన టౌన్‌షిప్‌లో మాడిశెట్టి నాగేంద్రయ్యగుప్త, బూరెల నవీన్‌గుప్త ఆధ్వర్యంలో శ్రీవాసవి ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంతో మహిళలకు ఉపాధి కలుగుతుందని అన్నారు. ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంతో మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఇందుకు ముందుకొచ్చిన వారిని అభినందించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుట్టు మిషన్ దాతలు తాడేపల్లి వేంకటేశం, స్వర్ణకుమారీ, నవీన్‌గుప్త, ప్రసన్న పాల్గొన్నారు.

### బిసిలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలి : కటకం

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** బీసీలు అన్నిరంగాలలో అభ్యున్నతి సాధించాలని మన ఆలోచన ఫౌండర్, అవేర్ ఫౌండేషన్ చైర్మన్ కటకం నర్సింగరావు పేర్కొన్నారు. నాగోల్ మనఆలోచన ప్రధాన కార్యాలయంలో కటకం నర్సింగరావు ఆధ్వర్యంలో ఆదివారం యాదవ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా వెనకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు హక్కులు సాధించుకోవాలంటే రాజ్యాధికారం సాధించాలన్నారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు పోలెబోయిన సత్తయ్యయాదవ్, బచ్చనబోయిన శ్రీనివాస్‌యాదవ్, కదిరేకృష్ణయాదవ్, పిడికిలి రాజు, డాక్టర్ ఆవుల వెంకట్‌యాదవ్, పిల్లి వెంకటేష్‌యాదవ్, బాసబోయిన లింగస్వామి యాదవ్, కన్నీబోయిన సత్తయ్యయాదవ్, చిమల శ్రీనివాస్‌యాదవ్, వాసుయాదవ్, బాలరాజ్‌యాదవ్, దామోదర్‌యాదవ్, బొల్లిగార్ల వీరాంజకనేయులు, పాల్గొన్నారు.

### ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమానం

**సైదాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ గాయత్రినగర్ చౌరస్తాలోని నాగార్జున మాంటిసోరి ఐఐటి కాన్సెప్ట్ స్కూల్ 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ బట్టీ పట్టించే విధానం కాకుండా బోధనలో విషయ పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గత ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు రూ.10వేల నగదు బహుమతి, మెమొంటోను ప్రదానం చేశారు. కాగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సంగమేశ్వర్ గుప్తా, నాగార్జున విద్యాసంస్థల చైర్‌పర్సన్ జి.రజని విఠల్‌రెడ్డి, సిఏఓ శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, ప్రిన్సిపాల్ కట్టా రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**LOST OF DOCUMENTS**

★ **I, P. Janakirama Rao** S/o Late Madhava Rao R/o F.No.201, 2nd Block, Forefront Royal. Indian Air Lines Cly, Begumpet Sec'bad. While I was Travelling from Tarnaka to Begumpet Airlines Cly I Lost my Original Sale Deed Documents Nos. 5188/1993, 1082/2006 11417/2006 and 13075/2006 Registered at Ranga Reddy If Anyone found Plz Cont: **8019770295.**

**CHANGE OF NAME**

★ **I, Kaushal Kumar** S/o Shyam Bihari R/o H.No.P.No.27, GFLR Rajeevgandhi Nagar, Borabanda, Sanathnagar, HYD. T.S. Changed my Daughter Name from ROSHANI KUMARI to **ROSHANI CHANDRAVANSHI.**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**PUBLIC NOTICE**

[illegible]

**NOTICE**

**IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT AT MALKAJIGIRI.**

**O.S.No. 1180 OF 2024.**

Between:
1. **Mohd. Saifuddin** S/o. Late, Shamsuddin Altamush, Aged about 28 years, Occ: Private Employee,
2. **Faiza Tamreen** D/o. Late, Shamsuddin Altamush, Aged about 20 years, Occ: Student,
(both r/o. 18-374, Mallikarjuna Nagar, Hanumanpet, Malkajgiri, Malkajigiri-Medchal District) ...**Plaintiffs**

And

1. **The Thasildhar,** Malkajigiri Mandal, Malkajigiri-Medchal District.
2. **The Branch Manager,** S.B.I., Anandbagh, Malkajigiri/Padmarao Nagar, Malakjigiri-Medchal/Hyderabad.
3. **All Concerned.** ...**Defendants.**

THIS IS TO INFORM YOU THAT THE ABOVE PLAINTIFFS FILED THE ABOVE SUIT SEEKING THE RELIEF OF DECLARATION AS A LEGAL HEIRS OF LATE. SHAMSUDDIN ALTAMUSH AND LATE UMME SALMA SHAMSUDDIN.

IF ANY MEMBERS OF THE GENERAL PUBLIC HAVE ANY OBJECTION TO GRANT SUCH DECLARATION, THEY ARE REQUIRED TO APPEAR BEFORE THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT MALAKJIGIRI COURT COMPLEX, KUSHAIGUDA, HYDERABAD EITHER PERSON OR THROUGHLY DULY APPOINTED ADVOCATE ON **12.02.2025 AT 10.30 A.M.** AND PLACE THEIR OBJECTIONS, IF ANY. PLEASE NOTE THAT IN CASE OF YOUR ABSENCE THE COURT SHALL PROCEED WITH THE MATTER IN ACCORDANCE WITH LAW.

(ISSUED UNDER THE ORDERS OF THE HON'BLE III COURT).

**D.V. RAMANA SARMA,**
**MOHAMMAD SALEEM**
**ADVOCATES**
PLOT NO.73, KALYANA NAGAR, EAST ANANDBAGH, MALKAJIGIRI, HYDERABAD - 500 047.
**(M) 96666 30230/81429 40413.**

**IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM- III-ADDL. DISTRICT JUDGE: RANGA REDDY DISTRICT. AT: L.B. NAGAR**

**MVOP. No. 284 OF 2024**

BETWEEN:
1. **Gollapally Ramulu @ Ramlu** S/o. Late. Gollapally Pochaiah, Aged about 65 years, Occ: Mason cum Agriculture, R/o Gollapally Village, Jagadevpur Mandal, Siddipet District, Telangana State, Pin Code: 502 281
**Presently Residing at:** R/o. H. No.130-43/A, Suryodaya Colony, L.B Nagar, Ranga Reddy District. ...**PETITIONERS**

AND

2. **S.N.R. Logistics** Rep. By Shaik Nayab Rasool, H.No.8-3-293/82/8/155, Gayatri Hills, Road No.10C Golconda, Hyderabad, Telangana State Pin Code: 500 033 ...**RESPONDENTS**

Please take notice that in the above matter the Petitioner had filed case against you (Respondent No.2) for compensation for **Rs.12,00,000/-** and the same is posted for your appearance on **27-02-2025.** You are advised to appear **on 27-02-2025 at 10.30 A.M.** before the said court either in person or through an Advocate filing which, the case will be decided Ex-party.

(BY THE ORDER OF THE COURT)

**J. THIRUPATHI REDDY**
**Advocate**
H.No.1-9-260, Opp. Govt. Primary School, Kushaiguda Bus stop, Hyderabad-62. **9866 53 8586**



మాట్లాడుతున్న భైరగోని రాజుగౌడ్

## అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి : రాజుగౌడ్

**సైఫాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అసంఘటిత కార్మికులుగా ఉన్న లక్షలాది మంది డ్రైవర్లకు తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ సెక్యూర్ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు భైరగోని రాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలంగాణ సెక్యూర్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కొంతం మహేష్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా బి.ప్రసాద్, ప్రధానకార్యదర్శిగా పొడుగు శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులుగా జి.అనిల్, డి.పవన్, కోశాధికారిగా జె.కుమార్, సలహాదారుగా వంగ కృష్ణాకర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా నర్సింహ్మా, పి.మహేందర్, సి.హెచ్.రమేష్, ఎన్.ఎం.మహేష్, వై.వీరన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. డ్రైవర్ లైసెన్స్ పై ఉన్న ప్రమాద బీమా 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలని, సాధారణ మరణం జరిగితే కూడా ఈ బీమా పథకాన్ని వర్తింపజేయాలని, ప్రతి డ్రైవర్‌కు సబ్సిడీ వాహనాన్ని అందించాలని, పెరిగిన పెట్రోల్, గ్యాస్,డిజీల్ ధరలకు అనుగుణంగా ఆటో, కాయబ్ చార్జీలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ప్రతి ఆటో డ్రైవర్‌కు డబుల్ బెడ్‌రూంను కేటాయించాలిని ఆయన సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## బిజెపిలో చేరికలు...



అర్పితారాధాకృష్ణకు కండువా కప్పుతున్న శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9ప్రభాతవార్త:** ఢిల్లీలో మాదిరిగా తెలంగాణలోనూ బిజెపి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్-1 బిజెపి అధ్యక్షుడు పసునూరి బిక్షపతిచారి ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేట్ మాజీ వార్డు సభ్యురాలు కాసోజు అర్పిత రాధాకృష్ణ, అలిశెట్టి కల్పన, పున్న గాయత్రి, యెల్లంకి రేణుక, నడికుడి వర్షిత, కాంచనపల్లి మాధురి, పల్లవి లక్ష్మిలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు ఆదివారం బిజెపిలో చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి కాషాయ కండువాలువేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్ముందు బిజెపిలో చేరికలు మరిన్ని ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, కీసర హరినాథ్‌రెడ్డి, ఎ.భీమ్‌రాజ్, పార్టీ నాయకులు కాసోజు రాధాకృష్ణ, కార్తీక్ సాగర్, హరిత, శివకుమారాచారి, శ్యామ్ సుందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

### బాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** స్వీయ రక్షణ కోసం బాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. నాదర్‌గుల్‌లోని ప్రెస్ కాలనీలో ఆదివారం నూతనంగా ఏర్పాటైన గ్లాడియేటర్స్ కరాటే, తైక్వాండో ఆకాడెమీని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదపడతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మార్షల్ ఆర్ట్స్ విషయంలో ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నిమ్మల సునీతా శ్రీకాంత్‌గౌడ్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ 1, 2 బిజెపి అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డిలతోపాటు తోట అమరేందర్‌రెడ్డి, పవన్ కుమార్, మహేందర్, జయంత్‌రెడ్డి, ప్రవీణ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీలో బిజెపి గెలుపు పట్ల మీర్‌పేట్‌లో సంబరాలు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం తెలంగాణలోని బిజెపి శ్రేణులకు స్ఫూర్తినిచ్చిందని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్-1 బిజెపి అధ్యక్షుడు పసునూరి బిక్షపతిచారి అన్నారు. ఢిల్లీలో బిజెపి ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మీర్‌పేట్‌లో టపాసులు కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా బిక్షపతి చారి మాట్లాడుతూ ఢిల్లీలో మాదిరిగా తెలంగాణలో బిజెపి విజయం సాధించడానికి పట్టదలతో పని చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ శ్రేణుల నాయకులు, పార్టీ సానుభూతిపరులు, అభిమానులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ నేతకు సబితారెడ్డి పరామర్శ

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** పితృ వియోగంలో ఉన్న బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు పుల్లగుర్ల సంజీవను ఆదివారం మాజీమంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి పరామర్శించారు. సంజీవ తండ్రి రంగయ్య మృతి చెందారని తెలుసుకున్న సబితారెడ్డి ఆదివారం గుర్రంగూడలోని వారి నివాసానికి వచ్చి సంజీవతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థిగా శ్రీనివాస్‌గుప్తా

**బేగంబజార్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఖమ్మం, నల్గొండ, వరంగల్ టీచర్ నియోజకవర్గం ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థిగా బొద్దు నాగరాజును ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త ప్రకటించారు. ఆదివారం గోషామహల్ పార్టీ కార్యాలయంలో బొద్దునాగరాజుకు బి ఫామ్ ఇచ్చి నాగరాజుకు అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నియోజకవర్గాలలో ఉన్న ఉపాధ్యాయులు ప్రజాఏక్తాపార్టీ ఉపాధ్యాయ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

### విద్యార్థులకు రాజకీయ, న్యాయవ్యవస్థపై అవగాహన కల్పించాలి

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థీ, విద్యార్థులకు సమాజంలోని విద్య, వైద్య, ఉద్యోగ, రాజకీయ, న్యాయ వ్యవస్థ, పోలీసు విభాగాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీకృష్ణవేణి టాలెంట్ విద్యాసంస్థల అధ్యక్షులు జైపాల్‌రెడ్డి అన్నారు. రహీంపురా శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యాఎక్స్‌ఫో కార్యక్రమంలో పాఠశాల బాల, బాలికలు, ఉపాధ్యాయులు తయారు చేసిన వివిధ నమోనాలను జర్నల్ ఇన్‌చార్జ్ జహంగీర్,ప్రిన్సిపల్ జి.బెన్నిలతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా చిన్నారులు సమాజంలో ప్రజలు చేస్తున్న వృత్తులను రూపొందించిన పోలీస్‌స్టేషన్, క్లీనిక్, పోస్టాఫీస్ తదితర నమోనాలు ఎంతో ఆకట్టుకున్నాయి. వాటిని తయారు చేసిన ఉపాధ్యాయులు,చిన్నారులను యాజమాన్యం అభినందించారు. అయోధ్య, చిత్రపటం, రాముడు, అంజనేయ వేషదారణ మంత్రముగ్దులను చేసింది.

### జాంబాగ్‌లో ఉచిత వైద్య శిబిరం

**జియాగూడ, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం పట్ల ప్రత్యేక శ్రద్ద కనబర్చాలని గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్ అన్నారు. ఈమేరకు ఆదివారం జాంబాగ్‌లోని యాదవసంఘం భవన్‌లోఅగర్వాల్ మానవ సేవ మంచ్, జాంబాగ్ యాదవ్ సంఘం ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిభిరాన్ని గొల్కొండ జిల్లా అద్యక్షులు వి.పాండుయాదవ్, విఠోభా దేవాలయం అధ్యక్షులు వి.కిషన్ యాదవ్, యాదవ సంఘం అధ్యక్షులు బోయిని వెంకటేష్‌యాదవ్, కోశాధికారి మనిష్‌యాదవ్‌తో కలిసి రాజాసింగ్ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్చంద సంస్దలు ముందుకు వచ్చి పేదలకు మరిన్ని సేవలను అందించాలన్నారు. ముఖ్యంగా అగర్వాల్‌సమాజ్,యాదవ్ సమాజ్ లు వైద్యశిబిరం ఏర్పాటుచేసి ఉచితంగా వైద్యసేవలను అందించడం సంతోష దాయకమన్నారు. వైద్యపరీక్షలు అందించి ఉచితంగా మందులను అందచేశారు.

## డంపు యార్డ్‌కు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం

**-గ్రామాలలో ఎందుకు సభలు నిర్వహించలేదు**
**-పిసిబి, ఫారెస్ట్ అధికారులు ఎక్కడ నిద్రపోతున్నారు**
**-పోలీసు చెక్ పోస్టులను వెంటనే ఎత్తి వేయాలి**
**-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. రాజయ్య**

**గుమ్మడిదల, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:** గత వారం రోజుల నుంచి ప్యారానగర్ డంపు యార్డ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. రాజయ్య అన్నారు. ఆదివారం గుమ్మడిదలకు వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గత వారం రోజుల నుంచి ప్యారానగర్ డంపు యార్డ్‌కు వ్యతిరేకంగా అనేక గ్రామాల ప్రజలు వివిధ రూపాలలో ప్రత్యక్ష ఆందోళనలు, పోరాటం చేస్తుంటే జిల్లా కలెక్టర్ ఎందుకు పర్యటన చేయలేదని, కనీసం ఒక్క జిల్లా అధికారి కూడా ఎందుకు పర్యటన చేయట్లేదని, ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజలు బాధలతో రోడ్ల మీదకు వచ్చి నిరసన చేస్తుంటే కంటికి కనిపించడం లేదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. అనేక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతుంటే గ్రామాలలో సభలు ఎందుకు నిర్వహించలేదని, ప్రజలకు వాస్తవాలు ఎందుకు చెప్పడం లేదని అన్నారు. గ్రామ సభలు పెట్టకుండా, ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా డంపు యార్డ్ ఆగ మేఘాల మీద పోలీసుల ద్వారా బందోబస్తు పెట్టి నిర్మిస్తున్నారంటే ఏదో దాగి ఉందని అర్థం కాదా?, ఏమి సమస్య లేకపోతే ఇంత పోలీసు నిర్బంధం ఎందుకని ఆయన ప్రశ్నించారు. గ్రామాలలో ఎందుకు గ్రామ సభలు పెట్టి ప్రజలను చైతన్యం చేయలేదని, ఉన్న విషయాలు ఎందుకు వివరించడం లేదని ఆయన ప్రశ్నించారు. జిల్లాలో అసలు అధికారులు ఉన్నారా అని డౌటుగా ఉందని, ఇప్పటివరకు ఉన్నత అధికారులు ఎవరూ రాకపోవడం చాలా విచారకరమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏమో ప్రజల వద్దకు పాలన అని చెప్తున్నప్పటికీ మరి ఇంత పెద్ద సమస్య మీద అనేక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతుంటే ఎందుకు అధికారులు రావడం లేదని ప్రశ్నించారు. విషయం ఏదో దాగి ఉన్నది అనే కదా అని అర్థమవుతుందని ఆయన అన్నారు. ప్రజలు పోరాటాలు చేస్తుంటే ఈ రెండు శాఖలు కండ్లు అప్పగించి ఎందుకు చూస్తున్నారని ప్రశ్నించారు. డంప్ యార్డ్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సీపీఎం అండగా ఉంటుందని, అండదండలు ఇస్తుందని, ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొంటుందని ఆయన అన్నారు.

## అనంతసాగర్‌లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**కొండాపూర్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న 2003వ సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు. కొండాపూర్ మండలంలోని అనంతసాగర్‌లో సత్య వివాహ వేదికలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. 22 సంవత్సరాల పేగు బంధం కాదు, రక్త బంధం అసలే కాదు, ఎవరూ ముడి వేయకుండా ముడిపడిన బంధం ఇది అన్నారు. 22 ఏళ్ళ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అన్నారు. తాను పనిచేసిన పాఠశాలలో విద్యార్థులంతా 22 ఏళ్ల తర్వాత అనంతసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒకే చోట కలవడం ఆనందంగా ఉందన్నారు. తాము చదువు చెప్పిన విద్యార్థులు నేడు ఉద్యోగాల్లో, వ్యాపార రంగంలో మంచిగా స్థిరపడటాన్ని తాము ఎంతో సంతోషిస్తున్నామన్నారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని తమ కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకొని, తమ చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఆత్మీయ ప్రేమతో పలకరించుకున్నారు. మధుర జ్ఞాపకాలతో మైమరిచిపోయారు. తమ స్కూల్ డేస్ జ్ఞాపకాలతో చిన్నపిల్లల్లా మారి పాటలకు గెంతులేసి ఆనందంలో మునిగితేలారు. తమకుచదువులు చెప్పిన గురువులను శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణం,రవి,మానయ్య, ఆనందం, కృష్ణయ్య, వినోద్, చంద్రయ్య, బక్కయ్య, అశోక్, ఆగమయ్య, పూర్వ విద్యార్థులు ఉన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం దృశ్యం

### ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయండి

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):** ఈనెల 21, 22 తేదీల్లో సిద్దిపేట పట్టణంలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా 6వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి కోనేరు ప్రవీణ్ కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంత పోరాటాలు నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. ఈ మహాసభలలో విద్యావంతులు, మేధావులు, విద్యార్థి ప్రతినిధులతో సమస్యలపై చర్చలు జరిపి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. మహాసభలకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు అభికృష్ణ, వంశీ, అరుణ్‌కుమార్, దాసరి వికాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీగా ఉద్యమ నేతను గెలిపిద్దాం

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):** కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వై.అశోక్‌కుమార్‌ను గెలిపించాలని టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ జల్లల శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలీఅహ్మద్‌లు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్‌లోని లక్ష్మీప్రసన్న, సిరి, ఎలైట్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్ తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగ జేఏసిలో ప్రముఖ పాత్ర వహించారని, ఉమ్మడి మెదక్ జిల్లాలోని డిఎస్సీలలో జరిగినటువంటి పొరపాట్లను అధికారుల చేత సర్దించడంలో ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సత్యనారాయణ, రాంచంద్రం, టిపిటిఎఫ్ సీనియర్ నాయకులు రామచంనరదం, రాజులు, పంబాల ఎల్లయ్య, శంకర్, నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, పర్వతం నర్సయ్య, అక్కారం సత్తయ్య, విద్యాసాగర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే సునీతా రెడ్డి, టిఆర్ఎస్ యువ నాయకులు సంతోష్ రెడ్డిలు ఆదివారం నాడు తెలంగాణ భవన్‌లో టిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజక వర్గంలోని పరిస్థితలను కేటిఆర్‌కు వివరించారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యే సునీతా రెడ్డికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

### ఘనపూర్ పంప్ హౌస్ పనుల జాప్యంపై ఆగ్రహం

సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని నంగునూర్ మండలం ఘనపూర్‌లో నిర్మిస్తున్న ఘనపూర్ పంప్ హౌస్ నిర్మాణ పనుల జాప్యం హరీష్‌రావు అగ్రహం వ్యక్తం చేశారు. పనులు ఎందుకు జరగడం లేదని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. నెల చివరి కల్లా పనులు పూర్తి అందుబాటులోకి తేవాలన్నారు. కుడి కాల్వ ద్వారా యాసంగి పంటకు సాగునీరు వారం రోజుల్లోగ చెరువుల్లో నీళ్ల రావాలన్నారు. పంప్ హౌస్ నిర్మాణం పూర్తి అయితే వాగు అవతలి గ్రామాలకు సాగు నీరు అందుతుందన్నారు. అధికారులు,నాయకులు సమన్వయంతో వెంటనే పనులు పూర్తి చేసి రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

### దౌల్తాబాద్ పాఠశాల లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**హత్నూర ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1982 83 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం దౌల్తాబాద్ సమీపంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. 42 సంవత్సరాల తర్వాత నిర్వహించిన, సమావేశంలో అప్పటి పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు సన్మానం చేయడంతో పాటు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు .

### వ్యక్తుల కంటే సంఘం చాలా గొప్పది
### జిల్లా అధ్యక్షులు : ఇంద్రసేనారెడ్డి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :1971లో సామల యాదగిరి స్థాపించిన పిఆర్‌టియు సంఘం సాధారణ ఉపాధ్యాయునికి ఎన్నో సౌకర్యాలను సమకూర్చేలా..విద్యారంగ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తుందని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి అన్నారు. పిఆర్‌టియు 54వ ఆవిర్భావ తినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని పిఆర్‌టియు భవనంలో పిఆర్‌టియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు పిఆర్‌టియు నిరంతరం కృషి చేస్తూ ఎన్నో విజయాలను సాధించిందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు మెరుగైనా పిఆర్‌సిని అందించడానికి పిఆర్‌టియు చేసిన కృషి చాల గొప్పదన్నారు. ఉపాధ్యాయుల, విద్యారంగ పరిరక్షనే పిఆర్‌టియు లక్ష్యమన్నారు. వ్యక్తుల కంటే సంఘం చాలా గొప్పదని పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిఆర్‌టియు అధికారిక అభ్యర్థిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించుకుందామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్ శర్మ తదితరులు మాట్లాడారు. అనంతరం సంఘంలో దశాబ్దాల కాలంగా విశేష సేవలు అందించి ఇటీవల పదవి విరమణ పొందిన నాయకులను శాలువాలతో ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర,జిల్లా ప్రతినిధులు నర భాస్కర్‌రెడ్డి, పాతూరు సుజాత, నీలం శ్రీనివాస్, ఆస లక్ష్మణ్, అనిల్‌కుమార్, పాతూరి రమాదేవి, ఎల్లంకి అనిత, అనిల్‌కుమార్, రామచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పార్థసారధి, వెంకటేష్, వెంకట్రామిరెడ్డి, వెంకటరమణ, వెంకట నర్సారెడ్డి, శ్రీశైలం, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చేబర్తి, నర్సన్నపేటలో పశువుల చోరీ

**మర్కుక్, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చేబర్తి, నర్సన్నపేట గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు పశువులను చోరీచేసుకెళ్ళిన సంఘటన చోటుచేసుకుంది. మర్కుక్ ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం చేబర్తి గ్రామానికి చెందిన గ్యార శ్రీశైలంకు సంబంధించిన రెండు ఎడ్లను, నర్సన్నపేటకు చెందిన గంటి రాజిరెడ్డికి సంబంధించి రెండు ఎడ్లు, ఒక గేదెను వారి వ్యవసాయ పొలాల వద్ద శుక్రవారం రాత్రి కట్టివేయగా గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్ళారు. దీంతో రైతులు రాజిరెడ్డి, శ్రీశైలంలు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. సుమారు ఐదు పశువులు రూ.3 లక్షల వరకు ఉంటాయని, మా పశువులు మాకు దొరికే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

### మృతుని కుటుంబానికి లక్ష్మీ ఫౌండేషన్ చేయూత

గజ్వేల్, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డుకు చెందిన నర్సి చంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్, తాజా మాజీ కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మి కనకయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డాకని బిక్షపతి, 4వ వార్డు అధ్యక్షుడు ఎక్కలదేవి కనకరాజుయాదవ్, 3వ వార్డు అధ్యక్షుడు శ్రీరామ్ మల్లేశం, గజ్వేల్ సాయిలు ు పాల్గొన్నారు.

### భారీగా తరలివచ్చిన భక్తజనం కిటకిటలాడిన మల్లన్న ఆలయం

**కొమురవెల్లి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** :ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి క్షేత్రం 4వ వారం సందర్భంగా భక్తుల భారీగా తరలిరావడంతో కిటకిటలాడింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొని పరవశించి పోయారు. గుట్టపై ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకొని పట్నాలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. గంగరేగు చెట్టు వద్ద ముడుపులు తదితర మొక్కులు తీర్చుకోవడంతో పాటు కొరికలు తీర్చాలని స్వామివారిని వేడుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రామాంజనేయులు తగు ఏర్పాట్లు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అలయ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### స్ఫూర్తిధాయక జీవితాన్ని కొనసాగించాలి

**రేగోడ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** రేగోడ్ మండల కేంద్రంలోని జెడ్పీ హై స్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2001-02 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు 23 ఏళ్ల పూర్తి కావడంతో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని గురువులతో కలిసి వైభవంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో సరస్వతీ మాత విగ్రహానికి భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. 23 సంవత్సరాల తర్వాత వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 50 మంది పూర్వ విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలుసుకొని అనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కలుసుకున్న వారంతా ఒకరిని ఒకరు పలకరించుకొని వారి జీవన స్థితిగతులు పంచుకుని రోజంతా ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు స్ఫూర్తిధాయకమైన జీవితాలను సంతోషకరంగా కొనసాగించాలని ఉపాధ్యాయులు హితవు పలికారు. ఉపాధ్యాయులు పాఠశాలలో పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. వ్యక్తిగత జీవితాలలో కూడా ఆలోచనాత్మకంగా వ్యవహరించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రేగోడ్ పాఠశాలలో విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు అప్పటి టీచర్లు చేసిన కృషి మరువలేనిదని విద్యార్థులు ఉపాధ్యాయులను కొనియాడారు. వారు అందించిన విద్యాబుద్ధుల కారణంగానే ప్రస్తుతం మంచి స్థాయిలో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాందేవ్, రాజేశ్వర్, నాగేశ్వర్ రావు, నరేందర్, బేతయ్య, విఠల్ రావు, చంద్ర శేఖర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అంజిబాబు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం దృశ్యం

### పద్మశాలీ వనభోజనంలో మాజీ మంత్రి




వన భోజనంలో పాల్గొని మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** పట్టణంలో పద్మశాలీల వన భోజనాల కార్యక్రమానికి మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూపద్మశాలీ కులస్థులకు ప్రభుత్వం అండగ ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే ద్వార బిసిల్లోని అన్ని కులాల వారికి సమన్యాయం జరుగుతుందని, అందరికి ప్రభుత్వ ఫలాలు అందుతాయాని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కండెంనర్సింలు, నాయకులు రాములు నేత, ఐఎన్టియుసిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజ్‌కుమార్, నాయకులు ఎంయసి డైరెక్టర్ శేఖర్, సాంసాన్, రాచయ్య, ఇనాయత్, మోయిజ్, గౌస్‌బాయ్, పద్మశాలిసంఘంఅధ్యక్షులుగడ్డం జనార్ధన్, పద్మశాలికుల ు పాల్గొన్నారు.

### ఘనంగా పిఆర్‌టియు దినోత్సవం




పిఆర్‌టియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

**జహీరాబాద్,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త:** పట్టణంలోని ఎంఆర్‌సి ఆవరణలో ఆదివారంపిఆర్‌టియుఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పుర్కరించుకుని జండాను ఆవిష్కరించి ఉత్సవాలనుప్రారంభించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ అధ్యక్షులు డాక్టర్ తులసిరామ్ రాథోడ్, జహీరాబాద్ అర్బన్ అధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి తుకారామ్ చవాన్, జహీరాబాద్ రూరల్ అధ్యక్షులు ఎస్ బాగయ్య, ప్రధాన కార్యదర్శి యం అశోక్, మొగుడంపల్లి మండల అధ్యక్షులు చందు రాథోడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, న్యాల్‌కల్ అధ్యక్షులు మురళీధర్, ప్రధాన కార్యదర్శి పాండయ్య, రాయికోడ్ అధ్యక్షులు యాదవులు, కోహీర్ అధ్యక్షులు తిరుమలేష్, ఝురాసంగం అధ్యక్షులునాగయ్యస్వామి,అసోసియేట్ అధ్యక్షులు డి శ్రీనివాస్, నర్సయ్య, అమర్నాథ్‌రెడ్డి, హీరాలాల్ చవాన్,కె ఆనంద్, ప్రసాద్, శేఖయ్య, జి రమేష్, వెంకటేశ్వర్లు, రాచన్న, అర్జున్ చవాన్, రాజ్‌కు మార్, వెంకటేశం, రత్నయ్య, కిషన్ చవాన్,, ప్రతాప్‌కుమార్ పాల్గొని పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు

### నేషనల్ మీన్స్ స్కాలర్ షిప్‌కుఏలేందర్ఎంపిక

**పాపన్నపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** నేషనల్ మీన్స్ స్కాలర్ షిప్‌కు మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో విద్యను ఆర్జిస్తున్న చెల్మటి ఎలేందర్ ఎంపికయినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఎలేందర్ ప్రతిభ చాటి స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు

### మతి స్థిమితం లేని వృద్ధురాలి మృతి

**పాపన్నపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** మతిస్థిమిత్తం లేని వృద్దురాలు పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయ పరిసరాల్లో శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం...నల్లగొండ జిల్లా అడవిదేవునిపల్లి మండలానికి చెందిన కట్టమూరి లక్ష్మి కోటేశ్వరి (74) మాఘ అమావాస్యను పురష్కరించుకుని ఏడుపాయల్లో మాఘ స్నానాలు ఆచరించేందుకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లకుండా ఇక్కడే ఉంటూ వస్తోంది. మతిస్థిమిత్తం అంతంత మాత్రంగా ఉన్న లక్ష్మి కోటేశ్వరి శనివారం రాత్రి సయయంలో కానరానిలోకాలకు చేరిపోయింది. విషయం తెలుసుకున్న పాపన్నపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు త్రివిక్రమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

### మండలాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతాం..

**షాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** షాబాద్ మండలాన్ని అభివృద్ధి లో అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని గ్రంథాలయ సంస్థ రంగారెడ్డి జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని అంతారం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణంకోసం ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన గ్రామపంచాయతీ భవనం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలను మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధిలోఅగ్ర భాగాన నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు వెంకట్ రెడ్డి, అశోక్, చెన్నయ్య, మాజీ సర్పంచులు జనార్దన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లింగం, బుచ్చయ్య, ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు

### మధుసూదన్ రెడ్డిని కలిసిన గ్రామస్తులు

**షాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** మండలంలోని నానాందార్ ఖాన్ పెట్ గ్రామానికి చెందిన నేతలు గ్రంథాలయాల సంస్థ రంగారెడ్డి జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని చెరువు కట్టపై సిసి రోడ్డు వేయాలని గ్రామంలో స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని మాజీ ఎంపిటిసి పొన్న వెంకట్ రెడ్డి, మాజీసర్పంచ్ లింగం, మాజీ ఉప సర్పంచ్ నారాయణరెడ్డిలు కోరారు. ఈ విషయమై మధుసూదన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. గ్రామస్తులకు అవసరమైన మౌలిక సద్వాల కల్పనకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నాయకుడు శేఖర్ రెడ్డి, పద్మా రెడ్డి, రాజు, మల్లేష్, సురేష్ గౌడ్, వినోద్ గౌడ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

### పర్సాపూర్ రిటైర్డ్ టీచర్ నిస్వార్ధ సేవ

**కొడంగల్ రూరల్ ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** :కొడంగల్ మండల కేంద్రంలో పర్సాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్త తన ఉపాధ్యాయ వృత్తిలో నిస్వార్ధంగా పనిచేసే అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దిన గొప్ప మానవతావాది, నిస్వార్థపరుడు, పాఠశాలను, సమాజంను తన నిత్య జీవితంలో సమభాగంగా పనిచేసి సమాజంలో మానసిక రోగులను, పిచ్చివాళ్లను, అనాథలను, విద్యార్థులను చేరదీసి ఎంతోమందికి సేవలందించిన బస్తా మొగులయ్య సార్ గారి పార్థివదేహానికి పూలమాలలతో నివాళులర్పించిన తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎరన్ పల్లి శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం తాలూకా అధ్యక్షులు యు. రమేష్ బాబు,పట్టణ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు చంద్రశేఖం నాయకులు ఎరన్ పల్లి వెంకటయ్య, అశోక్ కుమార్, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.